సాక్షి
ఆదిలాబాద్
బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023



59వ రోజుకు 'డివిజన్' దీక్ష
బోథ్: బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా చేయాలంటూ చేపట్టిన దీక్ష 59వ రోజుకు చేరింది. మంగళవారం దీక్షలో వజ్జర్ గ్రామానికి చెందిన యూత్ సభ్యులు కూర్చున్నారు.



ఆశించి...ఆశలు తొలిచేసి..!
సోయాబీన్ రైతుల ఆశలు రాలిపోతున్నాయి. కాండానికి సోకిన పురుగు మొక్కను నిలువునా తినేస్తోంది. గింజను తాలుగా మారుస్తోంది. 8లో▸

గరిష్టం/కనిష్టం
29.0/24.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మట్టి విగ్రహాలను నెలకొల్పాలి



మట్టి విగ్రహాలను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్‌రూరల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను నెలకొల్పాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా పొల్యుషన్ సెంట్రల్ బోర్డు నుంచి జిల్లాకు 2,500 మట్టి విగ్రహాలను సరఫరా చేసింది. ఆదిలాబాద్ పట్టణంలోని బీసీ స్టడీ సర్కిల్ సెంటర్‌కు చేరిన వీటిని కలెక్టర్ రాహుల్‌రాజ్ మంగళవారం పరిశీలించారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ వెంట జిల్లా బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, తదితరులున్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు

ఇంద్రవెల్లి: ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ రాహుల్‌రాజ్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, బిల్లులతో పాటు స్టాక్‌ను పరిశీలించారు. ప్రస్తుతం మండలంలో అందుబాటులో ఉన్న ఎరువుల వివరాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎరువులు, పిచికారీ మందులను అధిక ధరకు విక్రయిస్తే దుకాణాలు సీజ్ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రాథోడ్ గణేశ్, సిబ్బంది ఉన్నారు.

సాయుధ రైతాంగ పోరాటంతోనే విముక్తి



మాట్లాడుతున్న మల్లేశ్

ఆదిలాబాద్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతోనే నైజాం పాలన నుంచి విముక్తి కలిగిందని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దర్శనాల మల్లేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీర తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సెమినార్‌లో ఆయన మాట్లాడారు. నిజాం పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. అయితే దీన్ని బీజేపీ నాయకులు కొన్ని వర్గాల మధ్య జరిగిన పోరాటంగానే చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. అవాస్తవాలను ప్రజలు నమ్మకూడదని, ఇప్పటికీ పేదల సమస్యలపై కమ్యూనిస్టు పార్టీలు నిరంతరం పోరాడుతూనే ఉన్నాయని స్పష్టం చేశారు.

అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: యువత ఓటు హక్కు కలిగి ఉండాలని డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యార్థి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు ప్రాముఖ్యతపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ తమ పేరును ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలోఓటు వజ్రాయుధమన్నారు. అలాగే తెలంగాణ చౌక్‌లో భీంపూర్ కేజీబీవీ విద్యార్థులు ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా హాజరయ్యారు. ఓటు హక్కు ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ సెక్టోరియల్ అధికారి శ్రీదేవి, డిప్యూటీ తహసీల్దార్ సాయిమహేశ్, ఆర్‌ఐ యజ్వేందర్ రెడ్డి, సందేశ్ పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్

బోథ్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ట్రైనీ కలెక్టర్ వికాస్ మోహతో మంగళవారం సందర్శించారు. ధ్రువీకరణ పత్రాలు, భూముల వివరాల రికార్డులను పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రకాశ్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్‌ఐ దశరథ్, సిబ్బంది ఉన్నారు.



భీంపూర్ మండలంలో ఓ లీజు స్థలంలో మాంగనీస్ ధాతువు కోసం తవ్వకాలు చేస్తున్న కూలీ (ఫైల్)

ఇకపై వేలమే..

- భూగర్భ గనుల లీజు విధానానికి స్వస్తి
- ఎంఎండీఆర్ యాక్ట్ ప్రకారం చర్యలు
- ప్రధాన ఖనిజ ఉత్పత్తి దక్కించుకోవాలంటే సంస్థల మధ్య పోటీ
- చిన్న ఖనిజంలోనూ ఇదే విధానానికి రాష్ట్ర సర్కార్ పచ్చజెండా
- క్వారీలకు కూడా సేమ్

సాక్షి,ఆదిలాబాద్: ప్రధాన ఖనిజ ఉత్పత్తికి సంబంధించి భూగర్భ గనుల లీజు విధానానికి కేంద్ర ప్రభుత్వం గతంలోనే సవరణ చేసింది. వేలం విధానం అమలు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో జిల్లాలో ప్రస్తుతం లీజు విధానంలో కొనసాగుతున్న సంస్థల కాల పరిమితి ముగిసిన వెంటనే ఆయా గనుల కేటాయింపులకు వేలం పద్ధతి అవలంభించనున్నారు. చిన్న ఖనిజం ఉత్పత్తిలోనూ ఇదే విధానానికి రాష్ట్ర సర్కారు ఇటీవలే పచ్చ జెండా ఊపింది. దీని ప్రకారం క్వారీలకు ఇదే విధానం అనుసరించనున్నారు.

ఆ సవరణలతో..
గనులు, ఖనిజాలు అభివృద్ధి, నియంత్రణ చట్టం (ఎంఎండీఆర్ యాక్ట్)– 1957కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం 2015లో సవరణలు చేసింది. దీని ద్వారా జిల్లా మినరల్ ఫౌండేషన్ (డీఎంఎఫ్) ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఖనిజ వనరుల కేటాయింపుల్లో పారదర్శకత కోసం అప్పట్లోనే వేలం పద్ధతిని తప్పనిసరి చేశారు. అయితే అంతకు ముందు ఉన్న చట్టం ప్రకారం ఏదైన సంస్థ వ్యక్తి దరఖాస్తు చేసుకున్నప్పుడు గనులను లీజు ఇవ్వడం జరిగింది. ఇప్పటికీ ఈ పద్ధతిలోనే కొనసాగుతున్నాయి. ఈ లీజు కాల పరిమితి 20 నుంచి 30 ఏళ్లు ఉండగా, ఆ తర్వాత కూడా రెన్యూవల్ పద్ధతిన పొడిగిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఆ సంస్థల కాల పరిమితి ముగిసే దశలో ఉండడంతో ఇకపై వేలం విధానం అమలుకు సన్నద్ధమవుతున్నారు. తద్వారా ఆ సంస్థల మధ్య పోటీ పెరిగి ప్రభుత్వానికి ఆదాయ పరంగా లాభం చేకూరే అవకాశం ఉంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..
జిల్లాలో ప్రధాన ఖనిజం సున్నపురాయి, మాంగనీస్. వీటికి సంబంధించిన గనులను ప్రభుత్వం గతంలో లీజు పద్ధతిన వివిధ సంస్థలకు అప్పగించింది. ఇందులో సున్నపురాయి పరంగా చూస్తే రేణుక సిమెంట్స్ లిమిటెడ్‌కు ఆదిలాబాద్ మండలం రామాయి గ్రామంలో వివిధ సర్వే నంబర్లలో 334 హెక్టార్లను కేటాయించింది. ఈ లీజు కాల పరిమితి 2046 వరకు ఉంది. ప్రస్తుతం నాన్ వర్కింగ్ గానే ఉన్నప్పటికీ ప్రభుత్వానికి వార్షిక అద్దె, ఇతరత్రా ఆ సంస్థ పరంగా చెల్లింపులు జరుగుతున్నాయి. ఇక మాంగనీస్‌కు సంబంధించి ఆదిత్య మినరల్స్ ప్రైవేట్ లిమిటెడ్స్‌కు జైనథ్, తాంసి మండలాల్లోని గూడ, పిప్పల్‌గావ్, నిపాని, తాంసిలలో సుమారు 185 హెక్టార్ల వరకు లీజు ఉంది. వీటిలో కొన్ని సర్వే నంబర్లలోని భూములకు సంబంధించి కాలపరిమితి 2025 వరకు ఉండగా, కొన్నింటివి వచ్చే నెల వరకు మాత్రమే ఉన్నాయి. మరికొన్ని ఇప్పటికే ముగిశాయి. ఇక బాలాజీ ఎలక్ట్రో స్మెల్టర్స్ లిమిటెడ్‌కు తాంసి, జైనథ్ మండలాల్లోని పిప్పర్‌కుంట, భోరజ్‌లలో సుమారు 156 హెకార్ల వరకు లీజు ఉంది. వీటిలో కొన్ని సర్వే నంబర్లలోని భూమి కాలపరిమితి వచ్చే ఏడాది ముగిసిపోతుండగా, మరికొన్నింటికి 2029 వరకు ఉన్నాయి. ఇక సురేష్ అగర్వాల్‌కు సంబంధించి తాంసి, ఆదిలాబాద్‌రూరల్ మండలాల్లోని గొల్లఘాట్, చాందా(టి), కుంబఝరి గ్రామాల్లో సుమారు 108 హెక్టార్ల భూమి లీజులో ఉంది. ఇందులో కొన్నింటి కాల పరిమితి 2027 వరకు ఉండగా, మరికొన్నింటివి 2029 వరకు ఉన్నాయి. ఇక ఎస్‌వై మినరల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించి ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని జందాపూర్ గ్రామంలో 79 హెక్టార్లలో లీజుఉంది. దీని కాల పరిమితి 2028 వరకు ఉంది. ఇవే కాకుండా జైనథ్ మండలం కాన్ప మేడిగూడ గ్రామంలో ఇదివరకు కుర్సింగ సీతారాం అనే సంస్థ మాంగనీస్‌కు సంబంధించి ఖనిజాలు వెలికి తీసేందుకు 13 హెక్టార్లు లీజుకు తీసుకోగా, మధ్య కాలంలో దాన్ని సరెండర్ చేసింది. అలాగే వీబీసీ ఫెర్రో అలియాస్ లిమిటెడ్ అనే సంస్థ కూడా తాంసి మండలం గొల్లఘాట్‌లో 14 హెక్టార్లకు సంబంధించి ఇదే విధంగా సరెండర్ చేసింది. కాల పరిమితి ముగిసిన, ముగియబోయే వాటికి సంబంధించి ఇకపై వేలం విధానంలో భూగర్భ గనుల శాఖ ఆయా సంస్థలకు అప్పగించనుంది. తద్వారా పారదర్శకతతో పాటు శాఖకు ఆదాయం పెరగనుంది.

క్వారీల పరంగా ఇదే పద్ధతి..
చిన్న ఖనిజం కంకర ఉత్పత్తి చేసే క్వారీల పరంగా ఆయా స్థలాలను లీజుకు ఇచ్చే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సవరించింది. లీజు కాల పరిమితి ముగిసిన తర్వాత ఆయా సంస్థలు, వ్యక్తులకు వేలం పద్ధతిలోనే ఆ క్వారీల స్థలాలను కేటాయించనుంది. జిల్లాలో సుమారు 15 సంస్థలకు 30 హెక్టార్లకు పైగా కంకర ఉత్పత్తి కోసం క్వారీలకు భూగర్భ గనుల శాఖ నుంచి లీజుకు ఇచ్చింది. వాటిలో కాల పరిమితి కొన్నింటివి వచ్చే ఏడాదికి ముగిసిపోతుండగా, మరికొన్నింటికి ఇంకా అనేక సంవత్సరాలు ఉన్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో గనుల శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో చిన్న ఖనిజం ఉత్పత్తిలోనూ వేలం విధానాన్నే అవలంబించే విధంగా నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

వేలం విధానంలోనే గనుల అప్పగింత..
గనుల్లో ఖనిజం ఉత్పత్తికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర నిర్ణయాల మేరకు వేలం విధానంలోనే వాటిని సంస్థలకు అప్పగించే విధంగా చర్యలు చేపట్టాం. జిల్లాలో ప్రధానంగా మాంగనీస్, కంకరకు సంబంధించి క్వారీలు ఇప్పటివరకు లీజు పద్ధతిలో కొనసాగుతున్నాయి. వాటి కాల పరిమితి ముగిసిన తర్వాత వేలం ప్రక్రియ చేపట్టి కేటాయిస్తాం.
– రవిశంకర్, ఏడీ, గనులు, భూగర్భ శాఖ

17 జీపీలకు స్వచ్ఛ పురస్కారాలు

- నేడు కలెక్టర్ చేతుల మీదుగా సర్పంచులకు సన్మానం
- ముత్నూర్ పంచాయతీకి రాష్ట్రస్థాయి పురస్కారం

కైలాస్‌నగర్: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023 రాష్ట్ర, జాతీయ పురస్కారాల కోసం జిల్లా నుంచి పంపిన 17 గ్రామ పంచాయతీలకు నేడు జిల్లా స్థాయి పురస్కారాలు అందించనున్నారు. జిల్లాలోని 468 గ్రామ పంచాయతీలు ఇందు కోసం పోటీపడ్డాయి. స్వచ్ఛత, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్మాణం, తడి, పొడి చెత్త సేకరణ, బహిరంగ మల విసర్జన నిర్మూలన వంటి అంశాల్లో ఆన్‌లైన్‌లో ఆయా జీపీలు ప్రగతి వివరాలు నమోదు చేశాయి. ఇందులో ఎంపిక చేసిన వాటిలో ఇటీవల కేంద్ర బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామాల ప్రగతి, తీరు తెన్నులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ 17 జీపీల్లో ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామ పంచాయతీని మాత్రమే రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపిక చేశారు. అలాగే జాతీయస్థాయి అవార్డు కోసం కేంద్రానికి పంపించినట్లుగా జిల్లా అధికారులు చెబుతున్నారు. అయితే దీనికి సంబంధించి అధికారిక సమాచారం రావాల్సి ఉందని పేర్కొంటున్నారు. ఇక రాష్ట్ర పురస్కారం కోసం మావల మండలంలోని వాఘాపూర్, బేల మండలంలో సాంగిడి, శంషాబాద్, ఆదిలాబాద్ రూరల్ మండలంలో యాపల్‌గూడ, చందా–టి, జైనథ్ మండలంలోని మాకోడ, తలమడుగు మండలంలోని ఖోడద్, ఖరంపూర్, ఇచ్చోడ మండలంలో ముఖరా(కే), బోథ్ మండలంలో కౌట, బోథ్ బి, తాంసి మండలంలో తాంసి(బి), ఉట్నూర్ మండలంలో ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలంలో ఇంద్రవెల్లి, ముత్నూర్, మన్యాపూర్, గాదిగూడ గ్రామ పంచాయతీలు పోటీపడిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులను బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ చేతుల మీదుగా సన్మానించనున్నారు. అలాగే ప్రశంసపత్రాలు అందజేయనున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి జిల్లాలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలతో పాటు ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలను ఆహ్వానించారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు.

క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలి

- డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

ఆదిలాబాద్: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని డీసీసీబీ చైర్మన్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం నిర్వహించిన ఎస్జీఎఫ్, సౌత్ జోన్ అథ్లెటిక్స్ అసోసియేషన్, ఖేలో ఇండియా ఉమెన్స్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఎంతోమంది ప్రతిభగల క్రీడాకారులు ఉన్నారని పేర్కొన్నారు. నిరంతరం సాధన చేస్తూ



పరుగుపందెం పోటీని ప్రారంభిస్తున్న భోజారెడ్డి

జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, పెటా సంఘం ప్రధాన కార్యదర్శి స్వామి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజేశ్, శిక్షకులు రాకేశ్ తదితరులున్నారు.

భిక్షాటనతో 'సమగ్ర' ఉద్యోగుల నిరసన

కైలాస్‌నగర్: తమ సేవలను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు చేపట్టిన సమ్మె 15వ రోజుకు చేరింది. సర్కారు తీరును నిరసిస్తూ రోజుకో వినూత్న నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉద్యోగులు పట్టణంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. దీక్ష శిబిరం నుంచి ప్రారంభమైన ప్రదర్శన పలు వీధుల గుండా డీఈవో కార్యాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ నాయకుడు పడాల రవీందర్ మాట్లాడుతూ, శాంతియుతంగా నిరసన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో సంఘ బాధ్యు



భిక్షాటన చేస్తున్న ఉద్యోగులు

లు పార్థసారథి, ప్రకాశ్ వెంకటి, ధరమ్ సింగ్, సంప్రీత్, సలీం, రేణుక తదితరులు పాల్గొన్నారు.

బల్దియాకు కలిసొచ్చేలా.. ఎల్‌ఆర్‌ఎస్

- క్రమబద్ధీకరణ నిధులు మున్సిపాలిటీకే
- ప్రత్యేక ఖాతాలో జమ
- పట్టణాభివృద్ధికి దోహదం

ఎల్‌ఆర్‌ఎస్ కోసం అందిన దరఖాస్తులు 19,203
ప్రభుత్వానికి సమకూరిన ఆదాయం రూ. 1.92 కోట్లు
ఇప్పటి వరకు పరిశీలించిన దరఖాస్తులు 2వేలు

కైలాస్‌నగర్: లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) కింద ప్లాట్ల క్రమబద్ధీకరణ ద్వారా వచ్చే నిధులను మున్సిపాలిటీ ఖాతాల్లోనే జమ చేసుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందుకు సంబంధించి ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. తదనుగుణంగా బల్దియా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ప్రత్యేక బ్యాంక్ ఖాతా తెరిచారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం స్వీకరించిన దరఖాస్తు ఫీజు రూ. వెయ్యిని ప్రభుత్వ ఖజానాకు జమ చేయగా క్రమబద్ధీకరణ ద్వారా చేకూరే నిధులు మాత్రం బల్దియానే వినియోగించుకునేలా అవకాశం కల్పించింది. దీంతో బల్దియా ఖజానాకు భారీగా ఆదాయం సమకూరనున్నట్లు తెలుస్తోంది. వీటితో పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు దోహదపడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. అయితే దరఖాస్తుల పరిశీలన మాత్రం నత్తనడకన సాగుతుండడం గమనార్హం.



పట్టణంలో సర్వే చేస్తున్న మున్సిపల్ సిబ్బంది(ఫైల్)

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు వసూలు ఇలా
అనధికార లేఅవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందుకోసం 2020 ఆగస్టు 26న దరఖాస్తులు స్వీకరించింది. ఆదిలాబాద్ బల్దియా పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 19,203 మంది రూ.1000 చొప్పున ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల ప్రభుత్వం నుంచి అందిన ఆదేశాల మేరకు ఈ ప్లాట్లను ప్రస్తుతం క్రమబద్ధీకరిస్తున్నారు. 2020 ఆగస్టు 26 నాటికి సబ్‌రిజిస్ట్రార్ మార్కెట్ వాల్యూ ప్రకారం చార్జీలను వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇంటిప్లాటు 100 చదరపుమీటర్ల వరకు గల స్థలానికి చదరపు మీటర్‌కు రూ.200, 101 నుంచి 300 వరకు రూ.400,301నుంచి 500 వరకు రూ.600,ప్లాటుస్థలం 500 చదరపు మీటర్ల కు పైగా ఉన్నట్లైతే రూ.750 చొప్పున వసూలు చే యాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు వీటి ప్రకారం చార్జీ నిర్ణయించి ఫీజు వసూలు చేస్తున్నారు. ఇలా వచ్చిన సొమ్మును ఎల్‌ఆర్‌ఎస్ ప్రత్యేక ఖాతాలో జమ చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు దోహదం
ఎల్‌ఆర్‌ఎస్ ఫీజుల ద్వారా సమకూరే నిధులను బల్దియాస్థానికంగా వినియోగించుకోవచ్చనే ప్రభుత్వ ఆదేశాలతో పట్టణాభివృద్ధికి వెసులుబాటు కలుగనుంది. దరఖాస్తుల ద్వారానే రూ.1.92 కోట్ల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు జమ కాగా ప్రస్తుతం మార్కెట్ వాల్యూ ప్రకారం చేపడుతున్న ప్లాట్ల రెగ్యులరైజేషన్‌తో బల్దియాకు సమకూరే ఆదాయం భారీగా (రూ.కోట్లలో) ఉండనుంది. దీంతో పట్టణంలో రోడ్లు, మురుగుకాలువలు వంటి ఇతరత్రా మౌలిక వసతులను కల్పించేందుకు అవకాశం ఏర్పడుతుంది. అయితే పట్టణ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన నత్తనడకన సాగుతోంది. మొత్తం 19వేలకు పైబడి దరఖాస్తులు రాగా గడిచిన ఐదు నెలల వ్యవధిలో కేవలం 2వేలు మాత్రమే అధికారులు పరిశీలన పూర్తి చేయడం గమనార్హం.

ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరిచాం
ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ నిధులు జమచేసేందుకు ప్రత్యేక బ్యాంక్ ఖాతా తెరిచాం. ఇప్పటి వరకు పట్టణ పరిధిలో 2వేల దరఖాస్తులను పరిశీలన పూర్తి చేశాం. దరఖాస్తుదారులు ఎల్‌ఆర్‌ఎస్ కింద చెల్లించిన ఫీజును ఆ ప్రత్యేక ఖాతాల్లో జమ చేస్తున్నాం. – అనురాధ, టీపీవో, ఆదిలాబాద్

అక్రమ రవాణా అరికట్టేలా చెక్‌పోస్టులు

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి
- చంద్రాపూర్‌లో 'సరిహద్దు' సమావేశం
- సహకారం అందిస్తామన్న చంద్రాపూర్ ఎస్పీ రవీంద్ర

ఆదిలాబాద్‌టౌన్: అక్రమ రవాణా అరికట్టేలా మహారాష్ట్ర సరిహద్దులో చెక్ పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో మన జిల్లాతో పాటు అక్కడి జిల్లా పోలీసు అధికారులతో మంగళవారం సరిహద్దు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రానున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సమాచార వ్యవస్థ కీలకం కానుందని తెలిపారు. ఇరు రాష్ట్రాల మధ్య సమస్యల సత్వర పరిష్కారానికి ఇది దోహదం చేస్తుందన్నారు. అక్రమంగా తరలించే మద్యం, డబ్బుతోపాటు దేశీదారు, గం



మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి, పక్కన చంద్రాపూర్ ఎస్పీ రవీంద్ర తదితరులు

జాయి సరఫరా వంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపవచ్చని తెలిపారు. ఎన్నికల సమయంలో తమ ఉనికిని చాటేలా మావోయిస్టుల ప్రభావం ఉంటుందని, దీన్ని అరికట్టేలా మారుమూల ప్రాంతాల్లో సైతం నిఘా వ్యవస్థ పటిష్ట పరుచుకోవాలన్నారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన చర్యలు, ఇరు రాష్ట్రాల మధ్య సరిహద్దులో చెక్‌పోస్టుల ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న ఎన్‌బీడబ్ల్యూలను పూర్తి చేయడం, ఇతర అంశాలపై రెండు జిల్లాల ఎస్పీలు చర్చించారు. చంద్రాపూర్ ఎస్పీ రవీంద్ర సిన పరదేశి మాట్లాడుతూ, ఆదిలాబాద్ జిల్లా పోలీసు వ్యవస్థకు చంద్రాపూర్ జిల్లా పోలీసుల తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. చంద్రాపూర్ జిల్లాలో 24 గంటలు సమాచారం అందించే విధంగా కంట్రోల్స్ రూం ఏర్పాటు చేసున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి చంద్రాపూర్‌లోని మహాంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకుముందు చంద్రాపూర్ ఎస్పీని మన ఎస్పీ శాలువాతో సన్మానించారు. ఇందులో ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, డీసీఐఆర్‌బీ డీఎస్పీ శ్రీనివాస్, వరొరఘడ్ చందూర్ డీఎస్పీ నోపని, మూల్ డీఎస్పీ మల్లికార్జున, సీఐలు నరేష్, ప్రేమ కుమార్, జైనథ్, గాదిగూడ ఎస్సైలు, మహారాష్ట్ర బోర్డర్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టెట్ పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: జిల్లాలో ఈ నెల 15న నిర్వహించనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)ను ప్రశాంతంగా నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. టెట్ నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్, విద్యాశాఖ, రూట్ అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పేపర్–1 పరీక్ష ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతుందని చెప్పారు. పట్టణంలో ఏర్పాటు చేసిన 33 కేంద్రాల్లో 7,716 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. అలాగే పేపర్– 2 పరీక్ష మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 14 కేంద్రాల్లో 3,124 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదని, ప్రతీ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దివ్యాంగ అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రశ్న, జవాబ పత్రాల తరలింపును పటిష్టంగా నిర్వహించాలని, ప్రతీ కేంద్రం వద్ద పూర్తి స్థాయి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఈవో ప్రణీత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

క్లుప్తంగా

రిమ్స్‌లో మొరాయించిన లిఫ్ట్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ రిమ్స్ ఆస్పత్రిలో లిఫ్ట్ మొరాయించింది. మూడో అంతస్తు నుంచి పేషెంట్‌తో సహా మరో ఇద్దరు గ్రౌండ్ ఫ్లోర్‌కు వచ్చే క్రమంలో సాంకేతిక లోపంతో సెకండ్ ఫ్లోర్‌కు మధ్యలో ఆగిపోయింది. అందులో పేషెంట్ మిర్జాతో పాటు నగేష్, మరో వ్యక్తి ఉన్నారు. దీంతో అరగంట పాటు వారు అవస్థలు పడాల్సి వచ్చింది. లిఫ్ట్‌లో సెల్‌ఫోన్ సిగ్నల్ రాకపోవడంతో వాట్సాప్ కాల్ ద్వారా ల్యాబ్ టెక్నీషియన్‌కు ఈ విషయాన్ని తెలియజేశారు. దీంతో ఆయన రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ దృష్టికి తీసుకెళ్లి టెక్నీషియన్ ద్వారా లిఫ్ట్ ఓపెన్ చేసేలా చర్యలు చేపట్టారు. గత వారం రోజుల క్రితం కూడా ఇలాగే లిఫ్ట్ మొరాయించింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంటుందని పలువురు పేర్కొంటున్నారు. రిమ్స్‌లో లిఫ్ట్ ఎక్కాలంటేనే రోగులతో పాటు వారి బంధువులు భయాందోళన చెందుతున్నారు.

పింఛన్ కోసం దివ్యాంగుడి నిరసన


రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న సీపెల్లి

దస్తురాబాద్: దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ లో దివ్యాంగుడు రహదారిపై అడ్డుగా పడుకుని మంగళవారం నిరసన వ్యక్తం చేశాడు. మండలంలోని మున్యాల గ్రామానికి చెందిన దివ్యాంగుడైన సీపెల్లి ఆరేళ్ల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై రెండు కాళ్లు చచ్చుపడిపోవటంతో చక్రాల కుర్చీకే పరిమితమయ్యాడు. ఆరు సంవత్సరాలుగా పింఛన్ మంజూరు కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఫలితం కానరావడం లేదు. దీంతో పాండ్వాపూర్–కలమడుగు రహదారిపై పడుకొని నిరసన వ్యక్తం చేశాడు. దీంతో రహదారిపై వాహనాలు నిలిచిపోవటంతో పోలీసులు వచ్చి నచ్చజెప్పిన వినకపోవటంతో మండల ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ జాకీర్ సంఘటనా స్థలానికి చేరుకొని వికలాంగునిడితో మాట్లాడారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారిస్తామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించాడు.

కవిత మాస్క్‌తో ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల నిరసన


కవిత ఫేస్‌మాస్క్‌తో మహిళా ఉద్యోగులు

నిర్మల్‌రూరల్: విద్యాశాఖలో తమను క్రమబద్ధీకరించాలని కోరుతూ 16 రోజులుగా దీక్ష చేస్తున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు మంగళవారం వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట దీక్ష శిబిరంలో ఎమ్మెల్సీ కవిత ఫేస్ మాస్క్‌ను ధరించి బతుకమ్మ ఆడారు. ఎన్ని విధాలుగా తమ నిరసనను వ్యక్తం చేసిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎంఈఓ శంకర్, విద్యాశాఖలో పనిచేస్తున్న ఐ ఎఫ్ టి యు ఉద్యోగులు, సిఐటియు నాయకులు, లోకేశ్వరం మండల పిఆర్టియు నాయకులు దీక్ష శిబిరాన్ని సందర్శించి తమ పూర్తి మద్దతును ప్రకటించారు.

ఆశించి...ఆశలు తొలిచేసి..!

- సోయా కాండాన్ని తినేస్తున్న పురుగు
- తప్పలుగా మారుతున్న సోయా గింజలు
- ఆందోళనలో రైతన్నలు

లోకేశ్వరం: సోయాబీన్ రైతుల ఆశలు రాలిపోతున్నాయి. కాండానికి సోకిన పురుగు మొక్కను నిలువునా తినేస్తోంది. గింజ దశలో పురుగు ఆశించడంతో గింజలు గట్టి పడకుండా తాలుగా (తప్పలుగా) మారుతున్నాయి. విత్తన రకం(జేఎస్–335, కేడీఎస్ 726)తో పాటు అన్ని కంపెనీలకు చెందిన సోయా సాగు చేసిన పొలాల్లోనే ఈ పరిస్థితి కనిపిస్తుంది.

నిర్మల్ జిల్లాలో లక్షా 10వేల ఎకరాల్లో సోయా పంటను ఖరీఫ్‌లో సాగు చేశారు. సోయా విత్తనాలు విత్తి 75రోజులవుతోంది. పంట పూత దశ దాటి గింజ గట్టిపడే దశలో ఉంది. మరో 40రోజులైతే కోతకు వస్తుంది. ఈ దశలో పురుగు సోకడంతో రైతులు కుంగిపోతున్నారు.

ఎండిపోతున్న మొక్కలు..

కాండానికి పురుగు సోకి మొక్కను పూర్తిగా తినేస్తోంది. గింజదశలో ఉన్న మొక్క నిలువుగా ఎండిపోతోంది. దీంతో గింజలు తాలు తప్పలుగా మారి నల్లగా మారుతున్నాయి. జిల్లాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. తానూర్, ముథోల్, లోకేశ్వరం, భైంసా, సారంగాపూర్ మండలాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది.


పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు


రంగు మారిన ఆకు


కాండంలో కనిపిస్తున్న పురుగు

కారణాలు ఏమిటో..?

- సోయా విత్తనాల్లో కల్తీ ఉండటమా? లేక వాతావరణంలో మార్పులా? అనేది అంతుచిక్కడం లేదు.
- ఈసారైనా సోయా దిగుబడి పెరుగుతుందని ఆశ పడిన రైతుల కొత్త వైరస్ కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.
- పంటకు ఏమైందో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు.
- గింజ దశలో ఏఏ పురుగు మందులను పిచికారీ చేయాలో తెలియక రైతులు అందోళన చెందుతున్నారు.

వరుసగా నష్టాలే...

పంటపై నమ్మకం పోతోంది

- సోయాబీన్ సాగుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పెట్టింది పేరు. రానురాను సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. గతేడాది లక్షా40వేల ఎకరాల్లో సాగైన సోయా ఈఏడాదిలో లక్షా 10వేల ఎకరాలకే పరిమితమైంది.
- గతంలో ఎకరానికి రూ.12వేల పెట్టుబడి అయ్యేది. ప్రస్తుతం తెగుళ్ల బెడద పెరగడంతో పురుగు మందులు విపరీతంగా పిచికారీ చేయాల్సి వస్తోంది. ఒకసారి మందు పిచికారీ చేస్తే రూ.1500 అవుతున్నాయి.
- ఈ ఖరీఫ్‌లో విత్తిన నెలరోజులకే ఆకులను పచ్చపురుగు తినేయడం మొదలుపెట్టింది.
- 15రోజుల క్రితం పూత దశలో పురుగు సోకకుండా పురుగు మందు పిచికారీ చేశారు.
- ప్రస్తుతం మళ్లీ గింజ దశలో మొక్క కాండానికి తెగుళ్ల సోకడంతో మూడోసారి పిచికారీ చేయాల్సి వచ్చింది.
- మూడేళ్ల నుంచి వరుసగా పూతకు వచ్చి, గింజ కట్టే దశలో తెగుళ్ల బారిన పడుతోంది. చీడ పీడల ఉధృతి ఎక్కువతోంది.
- గతేడాది కొత్తగా ఇన్సిట్యూ జర్మినేషన్‌తో పచ్చిని కాయలకు మొలకలు వచ్చి పంట తీవ్రంగా దెబ్బతింది.
- మొక్కపై సగం కాయలు ఎండిపోయి గింజగా మారగా, మరికొన్ని కాయలు పచ్చని కాతతో అలాగే ఉండడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది.
- ఎకరానికి పది క్వింటాళ్లు వచ్చే దిగుబడి 3 నుంచి 4 క్వింటాళ్లకు మించలేదు. కనీసం పెట్టుబడి ఖర్చులు దక్కలేదు.
- నెల రోజులు గడిస్తే చేతికి వచ్చే దశలో మొక్కకు పురుగు ఆశించడంతో మొక్క ఎండిపోయి గింజలు తప్పలుగా మారి నల్ల బడుతున్నాయి. దిగుబడి తగ్గుతుందని రైతులు వాపోతున్నారు.

మొక్క నిలువునా ఎండిపోతోంది



వట్టోలి శివారు ప్రాంతంలో నాకు ఐదు ఎకరాల సాగు భూమి ఉంది. ఇందులో రెండు ఎకరాల్లో పసుపు పంట వేయగా మూడెకరాల్లో సోయా పంటను సాగు చేశాను. ఈసారి సోయా ఏపుగా పెరగటంతో పంట దిగుబడి పెరుగుతుందని ఆశించాను. కాండాన్ని పురుగు తినేస్తోంది. గింజ గట్టి పడే దశలో ఉన్న మొక్క నిలువునా ఎండిపోతోంది. గింజతప్పగా మారి నల్లగా మారుతున్నాయి.

– ప్రవీణ్‌రెడ్డి, ధర్మోర, లోకేశ్వరం.

తెగుళ్ల ప్రభావం తీవ్రంగా ఉంది



సోయా పంట తెగుళ్లకు నాకు తెలిసిన పురుగు మందును పిచికారీ చేసిన తెగుళ్లు పోవడంలేదు. కాండాని పూర్తిగా పురుగు తినేస్తుంది. మొక్క ఎండిపోయి గింజలు తప్పలుగా మారడంతో ఆందోళన చెందుతున్నాం.

– బాలాజీ, బోరిగాం, తానూర్

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం

సోయా పంటను కాండం తొలిచే పురుగు ఆశించడంతో మొక్క ఎండు దశకు చేరుకుని కాయ తప్పగా మారుతుంది. రైతుల సమాచారం మేరకు ముథోల్, వెంకటాపూర్, కుభీర్ మండలంలోని సోనారి గ్రామాల్లోని సోయా పంటను పరిశీలించాం. ఆదిలాబాద్ ఏరువాక శాస్త్రవేత్తలచే సోయా పంటకు సోకిన కాండం పురుగు పరిశీలించి రైతులు తక్షణమే కోరజిన్ మందును ఒక ఎరానికి 60ఎంఎల్ మందులను తగిన మోతాదులో పిచికారీ చేయాలి.

– అంజిప్రసాద్, ముథోల్, ఏడీఏ

అక్కాపూర్‌లో చిరుతల సంచారం


గ్రామ శివారులో కనిపించిన పాదముద్రలు

నిర్మల్‌రూరల్: మండలంలోని అక్కాపూర్ గ్రామ శివారులో చిరుత పులులు సంచరిస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. సోమవారం గ్రామ శివారులోని భీమన్న గుడి దగ్గర ఉన్న పంట పొలాల్లో రెండు చిరుత పులులు కనిపించాయని మహిళలు పేర్కొంటున్నారు. అదే రోజు సాయంత్రం పాఠశాల దగ్గర పంట పొలాల్లో రెండు చిరుతపులులు కనిపించాయని ఇద్దరు యువకులు గ్రామస్తులకు తెలిపారు. దీనికి తోడు ఓ పంట పొలంలో అడుగులు కనిపించడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అటవీ అధికారులు మంగళవారం గ్రామానికి చేరుకొని పాదముద్రలు చూసి చిరుత పులివి కావని తెలిపారు. మంగళవారం గ్రామస్తులు ఎవరు పంట పొలాలకు వెళ్లలేదని తెలిసింది.

ఓటరు జాబితాపై కళాజాత


ఓటరు నమోదును పరిశీలిస్తున్న పీవో

తలమడుగు: గ్రామాల్లో ఓటర్ నమోదుతో పాటు జాబితాలో సవరణలపై ప్రజలకు తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులతో కళాజాత ప్రదర్శన నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మంగళవారం మండలంలోని నడుంపల్లి, నందిగామ, తలమడుగు గ్రామాలలో పర్యటించి ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఓటర్ నమోదు జాబితాలో సవరణల కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు. పజలకు ఓటరు జాబితా పై కళాజాత బృందాల అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమోహన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆదివాసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి


ఎమ్మెల్యే జోగు రామన్నతో మంత్రి కేటీఆర్‌ను కలిసిన దుర్వ నగేష్

ఆదిలాబాద్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, ప్రభుత్వంలో ఆదివాసుల్లోని తొమ్మిది తెగలకు ప్రాధాన్యతను ఇవ్వాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు దుర్వ నగేష్ మంత్రి కేటీఆర్‌ను కోరారు. మంగళవారం మంత్రి కేటీఆర్‌ను ప్రగతి భవనంలో కలిశారు. ఈ సందర్భంగా దుర్వ నగేష్ మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల్లో ఆదివాసీలకు మరిన్ని అవకాశాలు కల్పించాలని కోరిన్నట్లు తెలిపారు. ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలన్నారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు. దీంతో కేటీఆర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు.

సదరం సర్టిఫికెట్ జారీలో వైద్యుల అక్రమాలు


మాట్లాడుతున్న రూపేష్‌రెడ్డి

కైలాస్‌నగర్: రిమ్స్ వైద్యుల నిర్లక్ష్యంతో అర్హులైన వికలాంగులు, అంధులు రూ.4016 పింఛన్ పొందలేని పరిస్థితి ఏర్పడుతోందని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి ఆరోపించారు. సదరం సర్టిఫికెట్ల జారీలో అవినీతికి పాల్పడుతున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ఆదిలాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ వర్గాల వారికి ఆసరా పింఛన్లు అందిస్తుండగా రిమ్స్ వైద్యుల అలసత్వంతో అర్హులకు పింఛన్లు దక్కడం లేదని ఆరోపించారు. పెన్షన్‌కు అర్హులు ఉన్నప్పటికీ సర్టిఫికెట్ ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. వైకల్యం కనిపిస్తున్న డబ్బులు ఇవ్వకుంటే వైద్యులు పలు కారణాలు చెబుతూ ధ్రువీకరణ పత్రం ఇవ్వడం లేదన్నారు. యూత్ కాంగ్రెస్ నాయకులు అఖిల్, గోడే అవినాష్, మల్లయ్య, విపిన్ టక్రే, ప్రెసిడెంట్ బాపురావు, విజయ్ ఉన్నారు.

విద్యాసామగ్రితో బోధించాలి

నిర్మల్‌రూరల్: విద్యార్థులకు తరగతి గదిలో అభ్యసన సామగ్రితో బోధించాలని ఎస్సీఈఆర్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సువర్ణ వినాయక్ సూచించారు. జిల్లా కేంద్రంలోని మారుతి ఇన్ హోటల్లో మంగళవారం మండల స్థాయి తెలుగు సబ్జెక్టు రిసోర్స్ పర్సన్‌లకు తొలిమెట్టుపై శిక్షణ కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ ప్రాథమిక పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. జిల్లా విద్యాశాఖ, రూమ్ టు రీడ్ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమాన్ని పటిష్ఠంగా అమలు చేసే విధంగా మండలంలో ఉపాధ్యాయులందరికీ అవగాహన కల్పించాలన్నారు. డీఈవో రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఆటపాటలతో పాటు అభ్యసన సామర్థ్యాలు ముఖ్యమన్నారు. ఇందులో ఎస్‌వో నరసయ్య, ఎంఈవో శంకర్, రూమ్ టు రీడ్ ప్రతినిధులు శ్రీహర్ష, గోనె రవి, శిక్షణ అందిస్తున్న జిల్లా రిసోర్స్ పర్సన్స్ సంగీత, గోపాల్ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

కుభీర్: మండలంలోని న్యూ సాంగ్వి గ్రామానికి చెందిన కేర్ల సాయినాథ్(47) మద్యానికి బానిసై తాగిన మైకంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎండీ.షరీఫ్ తెలిపారు. పోలీసులు వివరాల ప్రకారం.. మృతుడు ఇటీవల తాగుడికి బానిసయ్యాడు. మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు చేన్లో పంటకు యూరియా చల్లుతానని చెప్పి వెళ్లి మధ్యాహ్నం రాలేదు. భార్య చేనుకు వెళ్లి చూడగా చెట్టుకు ఉరివేసుకొని కనిపించాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందుతాగి..

తలమడుగు: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సంతోష్ (45) రెండు సంవత్సరాలుగా మూర్ఛరోగంతో బాధపడుతున్నాడు. ఇటీవల పంట పొలంలో మూర్ఛ రావడంతో కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. తిరిగి ఇంటికి చేరుకొని మంగళవారం ఇంటి నుంచి పంటపొలానికి వెళ్లాడు. అక్కడే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: సెల్‌ఫోన్ చోరీకి పాల్పడిన దొంగను టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. టూటౌన్ ఎస్సై దేవకుమార్ వివరాల ప్రకారం.. బజార్‌హత్నూర్ మండలం చింతలసాంగ్వికు చెందిన సిడాం జైతు తన బంధువులు రిమ్స్‌లో చికిత్స పొందుతుండడంతో వారిని చూసేందుకు సోమవారం వచ్చాడు. రాత్రి కావడంతో రిమ్స్‌లోనే నిద్రపోయాడు. ఆ సమయంలో పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన అజర్ అహ్మద్ సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లాడు. బాధితుడు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దొంగను పట్టుకొని సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఒకరికి గాయాలు

ఇచ్చోడ: మండలంలోని నవేగావ్, మాల్యాల్ గ్రామాల మధ్య మంగళవారం సాయంత్రం ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో బిక్కు అనే వ్యక్తి తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించి చికిత్సలు అందిస్తున్నట్లు పైలట్ అలీం, ఈఎంటీ కృష్ణ తెలిపారు.

ఆరోగ్య మహిళా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్


వివరాలు తెలుసుకుంటున్న పీవో


రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కోరారు. మంగళవారం మండలంలోని శ్యాంపూర్ పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా కేంద్రం ప్రారంభోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లిక చేతుల మీదుగా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్య రక్షణకై ఆయా ఆరోగ్య కేంద్రాల వద్ద మహిళల కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి మహిళల దీర్ఘకాలిక రోగాలు, మహిళల్లో ఏర్పడే ఆరోగ్య సమస్యలపై కేంద్రాల్లో ప్రత్యేక మహిళా డాక్టర్లను నియమించి వారి ఆరోగ్య సమస్యలపై వైద్యం అందించడం జరుగుతుందన్నారు. మహిళలు తమ ఆరోగ్య సమస్యలు నేరుగా మహిళా డాక్టర్‌తో వివరించి సమస్య అధికంగా ఉంటే నేరుగా జిల్లా కేంద్రానికి తరలించి వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు ఏర్పాట్లను చేయడం జరుగుతుందన్నారు. ఆదిలాబాద్ జిలా 5 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అంతకుముందు ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ శ్యాంపూర్ పీహెచ్‌సీని సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను వైద్యాధికారి సందీప్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ జైవంత్‌రావు, నర్సాపూర్ సర్పంచ్ కళావతి, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ బాలు, డాక్టర్లు విజయ్, అనురాధ పాల్గొన్నారు.

ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రి సందర్శన


ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ రాహుల్‌రాజ్ సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉపేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఐటీడీఏ ఈఈటీడబ్ల్యూ భీంరావు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


అన్నం పరిశీలిస్తున్న కుమ్ర ఈశ్వరీబాయి

నార్నూర్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో చదవుకుంటున్న గిరిజన విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి అన్నారు. మంగళవారం మండలంలోని మాన్కాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. 8, 9వ తరగతి విద్యార్థినిలతో ముచ్చటించారు. వంటగది, విద్యార్థులకు అందిస్తున్న భోజన వసతి సౌకర్యాలను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. హెచ్‌ఎం దేవ్‌షా, వార్డెన్ ప్రతాప్, బీఆర్‌ఎస్ మహిళా అధ్యక్షురాలు విద్యారాణి ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

నిర్మల్‌ఖిల్లా: నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా కేంద్రంలోని విజేత స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎల్లయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలో జేవీఎస్‌ఆర్ పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న సీనియర్ 6వ నెట్‌బాల్ మహిళల, పురుషుల రాష్ట్రస్థాయి పోటీల్లో విజేత స్కూల్‌కు చెందిన ఎస్.రామ్ చరణ్, పి.శివానంద్, ఎం.మణికంఠ, బి.నందివర్ధన్, జె.వర్షిత్ విద్యార్థులు ఎంపికయ్యారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- టీఈఈ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలంగాణ ఎలక్ట్రిసిటి ఎంప్లాయీస్ 1104 యూనియన్ (టీఈఈ) రాష్ట్ర అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ తరంగిణిలో జిల్లా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆదిలాబాద్, ఉట్నూర్ డివిజన్ కార్యవర్గాలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులను దశలవారీగా రెగ్యులరైజ్ చేసేవిధంగా పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. ఆర్టిజన్ కార్మికులను వారి అర్హతను బట్టి పదోన్నతులు కల్పించేలా చూస్తామన్నారు. మీటర్ రీడర్స్, స్పాట్ బిల్లర్‌లను దశల వారీగా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా మార్చేవిధంగా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. 1999–2004 ఉద్యోగులను ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ ఉద్యోగులుగా మార్చేవిధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. విద్యుత్ శాఖ ఎస్‌ఈ సంపత్ కుమార్, డీఈ హరికృష్ణ, ఏఓ దిగంబర్, డీటీ ఈదన్న, ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయి బాబు, రీజినల్ అధ్యక్షుడు విలాస్ ఉన్నారు.

నూతన కార్యవర్గం..

ఆదిలాబాద్ డివిజన్ కార్యవర్గం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎస్.శ్రీనివాస్, ఆదిలాబాద్ సర్కిల్ అధ్యక్షుడిగా పి.విలాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నర్సింగ్, సర్కిల్ కార్యదర్శిగా లక్ష్మణ్‌రావు, అదనపు కార్యదర్శిగా చంద్రశేఖర్, ఆదిలాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా సత్తయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తాహెర్ పాషా, కార్యదర్శిగా శ్రీనివాస్, అదనపు కార్యదర్శిగా మెషక్‌లను ఎన్నుకున్నారు. అదేవిధంగా ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడిగా ఆనందయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా జె.శ్రీనివాస్, అదనపు కార్యదర్శిగా సత్యవాన్‌లను ఎన్నుకున్నారు.

'ఉన్నతి' శిక్షణను పరిశీలించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..


మాట్లాడుతున్న సువర్ణ వినాయక్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ఉన్నతి శిక్షణను ఎస్‌సీఈఆర్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సువర్ణ వినాయక్ పరిశీలించారు. 'ఇదేమి ఉన్నతి.. విద్యార్థులకు 'శిక్షణ' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. శిక్షణ కేంద్రంలో ఉపాధ్యాయులకు సౌకర్యాలు కల్పించకపోవడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతులు కల్పించకుండా ఏవిధంగా శిక్షణ నిర్వహిస్తారని ప్రశ్నించారు. విద్యార్థుల చేత కుర్చీలు ఎందుకు మోయించారని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరించారు. 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు ఉన్నతి శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ కంటె నర్సయ్య, రాష్ట్ర రిసోర్స్ గ్రూప్ సభ్యులు అశోక్, పసుల ప్రతాప్, డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్, రిసోర్స్ పర్సన్‌లు ఆశన్న, చరణ్‌దాస్, వేణుగోపాల్, పొచ్చన్న, రవికుమార్, స్వామి పాల్గొన్నారు.